# కర్తవ్యం

పార్క్‌లో వేపచెట్టు కిందవున్న సిమెంట్ బెంచ్ మీద ఉదయం ఆరున్నరగంటలకి కూర్చుని వుండటం మూడురోజులుగా గమనిస్తున్నాను. మార్నింగ్‌వాక్ ఆరు రౌండ్లు అయింతర్వాత, నేనూ మా కాలనీలో వున్న అడ్వొకేట్ వెంకట్రావు ఆ బెంచీ మీదే కుర్చోటం పరిపాటి. అయితే మా వాకింగ్ పూర్తయి వొచ్చేటప్పటికి ఆమె లేచి వెళ్లిపోయింది.

మొదటి రెండు రోజులూ, దూరాన్నుంచి చూశానేమో ఆనవాలు పట్టలేదు. మూడో రోజు కాస్త పరకాయించి చూడ్డానికి అవకాశం వుండేలాగ ఆమె అప్రయత్నంగా 'పాత్ వే' వైపు తిరిగింది. ఆమె ప్రసాదరావు భార్య, సరస్వతే అన్న అనుమానం కలిగింది. ఆమె సరస్వతే అయితే అమెరికా నుంచి అప్పుడే తిరిగొచ్చేస్తుందా! ఆగి, అడ్డం పడివెళ్లి పలకరించడం సభ్యత కాదని ఊరుకున్నాను.

ఇంటికి తిరిగొచ్చాక ఈ విషయం పద్మజకి చెప్పేను.

"సరస్వతేనండి. మీకు చెప్పడం మరిచిపోయేను. నిన్న 'ఫుడ్ వరల్డ్'లో కనబడింది. అమెరికానుంచి తిరిగొచ్చి నాలుగు రోజులయిందట" అంది. "ప్రసాదరావు పోయి రెండు నెలలేగా అయింది. వెంటనే కొడుకొచ్చి కర్మకాండంతా పూర్తిచేసి, తల్లిని వెంటబెట్టుకుని అమెరికా వెళ్లేడు. అప్పుడే తిరిగొచ్చేసిందా! కనీసం మనకో వుత్తరం ముక్కలేదు, టెలిఫోన్ లేదు" అన్నాడు.

"ఆమాటే అడిగేను. శాంతినగర్‌లో వాళ్ల చెల్లెలు గాయత్రింట్లో దిగిందిట. భార్యాభర్తలిద్దరూ ఇంజనీర్లు కదా! అమెరికా వెళ్లిన వారం రోజులకే ఫోన్ చేసి వీళ్ల యిల్లంతా 'రీ మోడల్' చేసి రంగులేసి సిద్ధం చెయ్యమందిట. నాలుగు రోజుల్లో పూర్తవుతుంది, టెలిఫోన్ కూడా 'రెస్టోరు' చేస్తారు అంది. ఈలోగా ఎవరింటికెడితే ఏం తప్పట్టుకుంటారో, ఎవరికి ఏం పట్టింపులుంటాయో, ఫోనొచ్చేక పలకరిద్దామని వూరుకుందట పాపం!" అంది పద్మజ.

* * *

మర్నాడు ఉదయం సరస్వతి లేచి వెళ్లకముందే పార్క్‌లో కలిసేను.

"నమస్కారం అన్నయ్యగారూ!" అంటూ నవ్వుతూ పలకరించింది.

ఎక్కడ ఏం గొల్లుమంటుందోనని భయపడ్డాను.

"కూర్చో అమ్మా! మూడురోజులుగా నిన్ను చూస్తున్నాను. నిన్న అనవాలు పట్టేను కానీ...."

"మొన్న పద్మజగార్ని కలిసేను, మీకు చెప్పే వుంటారు. నిన్న నేనూ మిమ్మల్ని ఆనవాలు పట్టేను. మీరూ, మీతో బాటు మరో ఆయనా వేగంగా నడుస్తున్నారు...."

"అతనెవరనుకున్నావు! ఎడ్వొకేట్ వెంకట్రావు. అయ్యప్పదీక్షలో వున్నాడు" అన్నాను నవ్వుతూ.

"అలాగా! ఆ నల్లబట్టలు, ఆ గెడ్డం. దూరాన్నుంచి ఎవరో అనుకున్నాను. ఇక్కడికి తిరిగొస్తున్నట్టు ఆయనకీ తెలీదు. ఆయన్ని కలవ్వలిసిన పనుంది. వూళ్లో వుంటారా? శబరిమలై..."

ఈ నెలంతా యిక్కడే వుంటాడు. ఇల్లంతా ముస్తాబు చేయించేవని తెలిసింది. ఇక్కడే స్థిరపడతావన్నమాట! చాలా సంతోషం. మీ అబ్బాయి, కోడలు యింత త్వరగా రానివ్వరేమో అనుకున్నాం."

"అక్కడే కూర్చుంటే ఎలా! ఇక్కడ చక్కబెట్టుకోవాల్సిన పనులు పెట్టుకుని! నేను నాలుగైదు రోజుల్లో ఫోన్ చేస్తాను- మీరు వొదినగారు ముందు మా యింటికి రావాలి" అంది.

★ ★ ★

"లంకంత ఇల్లు. ప్రసాదరావు తండ్రి కూడా నైజాం స్టేట్‌లో పెద్ద ఉద్యోగం చేసి, ఇప్పుడు కోట్లు విలువచేసే కావాల్సినంత ఆస్తి సంపాదించేడు. లింగు లిటిక్కుమంటూ ఈవిడ ఇక్కడ కూర్చునేం చేస్తుంది. ఇల్లూ, ఇళ్ల స్థలాలు - యింకా ఏమి ఆస్తులున్నాయో అన్నీ అమ్మేసి సొమ్ము చేసుకుని ఏకంగా బిచాణా ఎత్తేసి అమెరికాలో కొడుకు కోడలు దగ్గరుంటుందనుకుంటాను. చూస్తూ వుండండి" అంది పద్మజ.

"ఒక్కనాటికక్కడకింత తొందరగా వెళ్లదు. ఆస్తిపాస్తులమ్మడమంటే సులభం కాదు. ఈ సొమ్మంతా అక్కడికి చేరవెయ్యాలనుకోడం సాధ్యమూకాదు, వివేకంకాదు. రెండేళ్ల క్రితం ప్రసాదరావు సరస్వతి అమెరికా వెళ్లి నెలాపదిహేను రోజులుండేటప్పటికి మొహమ్మొత్తి తిరిగొచ్చేయలేదూ!" అన్నాను.

"అప్పటి సంగతి వేరు. ఇప్పుడు సరస్వతి వొంటరిది. అప్పుడైతే రెండో పెళ్లి పెళ్లామయినా, ఐయ్యేయస్ ఆఫీసర్ భార్యగా, ఎక్కడికెళ్లినా ఆ హోదా, ఆ హుందాతనం,

ఆ గౌరవం వుండేవి. ఇప్పుడుంటాయా! ఎక్కడికెళ్లినా 'అయ్యో పాపం' అని పరామర్శించే వాళ్లే కదా! చదువు సంస్కారం ప్రపంచానుభవం వున్నాయి, అక్కడే ఏదో వ్యాపకం కలిగించుకోగల సమర్థురాలు. ఇక్కడే వుండి ఏం బావుకుంటుంది! పైగా ఆ సవితి కొడుకు సురేష్ భ్రష్టుడై గర్భశత్రువై చివరికి తండ్రిపోతే తలకొరివి పెట్టడానికి కూడా రాలేదు. ఈవిడిక్కడే వుంటే ఎటువంటి అవమానాలకి గురిచేస్తాడో!" అంది పద్మజ.

"ఇంకిప్పుడు వాడేం చేస్తాడు! చెయ్యగలిగినదంతా చేసి, చివర్రోజుల్లో తండ్రి మనశ్శాంతి లేక 'హార్టెటాక్' వొచ్చి చావడానికి కారకుడయ్యేడు. ఇప్పుడు రెండు నెలలు పట్టి జైల్లో మూలుగుతున్నాడు. బెయిల్ కూడా యివ్వలేదు."

"వాడు కత్తితో పొడిచిన భాస్కర్ బ్రతికి బయటపడ్డాడు కదా! అయినా ఆ భాస్కర్ కదేంబుద్ధి! సురేష్ తన స్నేహితుడే కదా! వాడి భార్య రేఖతో అక్రమ సంబంధం పెట్టుకుంటాడా! పెద్ద చదువు చదువుకుంది, ఉద్యోగం చేస్తుంది, ఇద్దరు పిల్లల తల్లి, భర్త ఎంత దుర్మార్గుడైతే మాత్రం, రేఖకి మాత్రం బుద్ధుండొద్దూ! పైగా వాళ్లిద్దరిదీ లవ్ మేరేజ్ ఆయి".

"కేస్ ఇంకా విచారణలో వుంది. ఇంతకీ కేస్ పెట్టింది భాస్కర్ భార్య, సురేష్ తన భర్తని కత్తితో పొడిచేడని. తన భార్యతో భాస్కర్‌కి అక్రమ సంబంధం వుందని తెలుసుకుని ఉద్రేకంలో పొడిచేడని సురేష్ తరపున ప్లీడర్ వాదన. ఇదంతా రుజువవ్వాలి కదా!" అన్నాను.

"ఆ పొడిచేదేదో గట్టిగా పొడుచుంటే భాస్కర్ చచ్చేవాడు. ఉరిశిక్షతో ఆ సురేష్ చచ్చేవాడు. ఈ రేఖకీ బుద్ధొచ్చేది. సరస్వతికీ వాడి పీడ వొదిలేది" అంది పద్మ తన సహజ ధోరణిలో.

* * *

నాలుగు రోజులు పోయిన తర్వాత, మార్నింగ్ వాక్ అయిన తర్వాత మేము కూర్చున్నప్పుడు, "రెండు మూడు రోజుల్లో తన కుటుంబ వ్యవహారాల్లో సంప్రదించడానికి ఫోన్ చేసి సరస్వతిగారు మా యింటికి వస్తానన్నారు" అన్నాడు వెంకట్రావు.

"తప్పకుండా చెయ్యగలిగినదంతా చెయ్యి. చాలా మంచి మనిషి. కొడుకు సురేష్ మీదున్న క్రిమినల్ కేసవల్లొచ్చిన షాక్‌లోనే ప్రసాదరావు హార్టెటాక్ వొచ్చి పాపం! పోయేడు" అన్నాను.

"కేస్ విషయం అలా వుంచు. నలభయ్యేళ్లుగా మీ దంపతులు ప్రసాదరావు దాంపత్య జీవితాన్ని గురించి అన్ని విషయాలూ తెలుసుకున్నవాళ్లు. నేనాయన్ని అయిదారేళ్లుగా ఎరుగుదును. ఆమెతో పరిచయం కూడా అంతంత మాత్రమే. ఏ పెళ్లిళ్లలోనో రిసెప్షన్‌లోనో ఆ దంపతులు, మా దంపతులం కల్సుకున్నప్పుడు పలకరించుకోడానికే పరిమితం.

"చాలా అన్యోన్యంగా వుండే దంపతులు, సరదా అయిన వాళ్లు ఉదారస్వభావులు, ఉపకారస్తులు..."

"అనే నేనూ విన్నాను. అంత మంచివాళ్లకీ, పెద్దకొడుకు సురేష్‌కీ మధ్య అంత బద్ధవైరం ఎలా ఏర్పడిందో తెలుసుకునే అవకాశంకాని, అవసరం కాని యింతవరకూ కలగలేదు" అన్నాడు వెంకట్రావు.

"ఆ కథ పెద్దదే కాని క్లుప్తంగా చెబుతాను. సరస్వతి బియ్యే, ఆమె చెల్లెలు గాయిత్రి ఇంటరూ చదువుతూండగా, కుటుంబాన్ని దారిద్ర్యంలో ముంచి, క్షయ వ్యాధితో తండ్రి పోయేడు. గత్యంతరం లేక తమకేదైనా ఉపాధి కల్పించమని సరస్వతి మన కాలనీ మహిళామండలిని అర్థించింది. దానికప్పుడు ప్రసాదరావు మొదటి భార్య, వరలక్ష్మి అధ్యక్షురాలు. సానుభూతితో వాళ్ల తల్లికో 'ఫాస్ట్ ఫుడ్ సెంటర్'లో నౌకరీ యిప్పించింది. అప్పుడు సురేష్‌కి పదుకొండేళ్లు. ఇంటికొచ్చి వాడికి ట్యూషన్ చెప్పడానికి సరస్వతిని నియోగించింది. మొత్తంమీద సరస్వతి బియ్యే, గాయిత్రి ఇంటరూ పూర్తిచేశారు. ప్రసాదరావుతో చెప్పి సరస్వతికొక ప్రయివేట్ కంపెనీలో ఉద్యోగం వేయించింది. దాంతోబాటు సురేష్‌కి ట్యూషన్ కూడా కొనసాగిస్తూ ఆ కుటుంబాన్ని అనేక విధాల ఆదుకుంది. మహిళా మండలి కార్యకలాపాల నిర్వహణలో వరలక్ష్మి తన పెర్సనల్ సెక్రటరీగా సరస్వతిని వేసుకుని ఎంతో ఆదరించి అభిమానించింది".

"అయితే చిన్నప్పుడు సురేష్ సరస్వతిగారి శిష్యుడన్న మాట!" అన్నాడు వెంకట్రావు.

"అక్షరాలా! ఎటొచ్చీ వాడొక పెంకిఘటం. చదువంటే శ్రద్ధ లేదు. వరలక్ష్మి గారాబంవల్లా, అనారోగ్యంతో పెరిగిన అశ్రద్ధ వల్లా సురేష్ స్కూల్ ఎగ్గొట్టేసినా, ట్యూషన్ ఎగ్గొట్టేసినా, ప్రసాదరావుకి తెలిస్తే మండిపడతాడని, నిర్లిప్తంగా వూరుకునేది. అప్పుడిన్ని 'సూపర్ స్పెషాలిటీ హాస్పటల్స్'లేవు. ఆమె అనారోగ్యానికి కారణం 'లంగ్ కేన్సర్' అని తెలుసుకునేటప్పటికే వ్యాధి ముదిరిపోయింది. నెల్లాళ్లలో పోతుందనగా, నేనూ పద్మజ వుండగానే సరస్వతితో తను పోయినతర్వాత ప్రసాదరావుని పెళ్లి చేసుకుని, సురేష్‌ని జాగ్రత్తగా చూసుకుంటానని మాటిమ్మంది."

"అంతా సినిమా ఫక్కీలో అప్పగింతలు పెట్టిందన్న మాట! ఆ పరిస్థితుల్లో అది సహజమే అనుకో."

"సరస్వతి బెంబేలెత్తిపోయి వరలక్ష్మి చేతులు పట్టుకు ఏడ్చింది. నేనూ పద్మజ ఆమె చేతిలో చెయ్యేసి ధైర్యంగా వుండమని, దైవచింతన చెయ్యమని, ఆమె బ్రతుకుతుందని ఏవో ఓదార్పు మాటలు చెప్పేము. కాని ఆమె ఆ మాట ప్రసాదరావుతో కూడా అన్నట్టు తెలిసింది."

"సరే, ఆమె పోయింది. మీరు సరస్వతికి నచ్చజెప్పి పెళ్లి జరిపించేసేరు..." అన్నాడు వెంకట్రావు.

"వెంటనే అలా జరగలేదు. వరలక్ష్మి పోయిన ఆర్నెల్లకి ఆమె పుట్టింటివాళ్లు కలుగజేసుకుని వాళ్లకి తెలుసున్న కాస్త కలిగున్న వాళ్ల సంబంధాలే తీసుకురావడం మొదలెట్టేరు. ప్రసాదరావు ఐయ్యేయస్ ఆఫీసరు, నలభై రెండేళ్లు. మంచి చలాకీగా, సరదాగా వుండేవాడు. లోకజ్ఞానం వున్నవాడు. ఉదారస్వభావుడు. ఈ పరిస్థితిలో నేనూ, పద్మజ కలుగజేసుకున్నాం. సరస్వతి దగ్గిర సురేష్‌కి మంచి చనువుందన్న వుద్దేశ్యంతోనూ, నిస్సంకోచంగా సంతోషంగా సరస్వతి ఒప్పుకోవడంచేతనూ, అది తన భార్య అభిమతం అవడంవల్లనూ సరస్వతిని పెళ్లి చేసుకున్నాడు. దాంతో వరలక్ష్మి పుట్టింటివాళ్లు ప్రసాదరావు సరస్వతి వలలో పడ్డాడని వాళ్లిదర్నీ దుమ్మెత్తిపోసేరు."

"సురేష్‌ని దార్లోకి తెచ్చుకోలేదా సరస్వతి?"

"అదే సమస్య. వరలక్ష్మి చేసిన అతిగారాబం వల్లా, వాడికి చదువుపట్ల శ్రద్ధ లేకపోవడం వల్లా, ఎంత ప్రయత్నించినా వాడికి చదువు నేర్పడం ఆమెకి సాధ్యంకాలేదు. చివరికి సరస్వతి భయపడ్డట్టుగానే ఆ యేడు సెవెన్త్ క్లాస్ ఫెలయ్యేడు. దాంతో కొత్తపెళ్లాం మోజులో పడి...."

"వరలక్ష్మిగారి పుట్టింటివాళ్లు- అంటే ప్రతిపక్షాలు- అభాండం వేసుంటారు. ప్రసాదరావేం చేసేడు?"

"ప్రసాదరావు అప్పుడు జాయింట్ సెక్రటరీ ఎడ్యుకేషన్. ఆ స్కూల్‌కి వెళ్లి హెడ్‌మాస్టర్‌ని కల్సుకున్నాడు. గత మూడేళ్లుగా వాడి ప్రోగ్రెస్ రిపోర్ట్‌లూ, వాడి క్రమశిక్షణా రాహిత్యం గురించీ, చదువుపట్ల చూపే అశ్రద్ధ గురించీ, వాడి అల్లరి గురించీ క్లాస్ టీచర్లు చేసిన కంప్లెయింట్లన్నీ వరలక్ష్మి అందుకుని కూడా తనకి చెప్పకపోవడం ఈ

అనర్థానికి కారణమని గ్రహించేడు. ఆ యేడు ఆ స్కూల్లో సెవెన్త్‌లో అందరికీ ఫస్ట్ క్లాసొచ్చింది. వీడొక్కడే ఫెయిలయ్యేడు."

"మరి కుర్రాడి ప్రయోజకత్వాన్ని గురించి ప్రతిపక్షాలకి చెప్పలేదా?"

"ఆలస్యం చెయ్యకుండా, తన పలుకుబడి ఉపయోగించి, మంచి రెసిడెన్షియల్ స్కూల్లో అయిదో క్లాస్లో జాయిన్ చేసేడు".

"మరి సురేష్ ఊరుకున్నాడా?"

"వాడి అమ్మమ్మకీ, తాతయ్యకీ ఉత్తరాలు రాసేడు. స్కూల్ బాగా లేదని, హాస్టల్ బాగాలేదనీ, భోజనం బాగాలేదనీ, తననీ స్కూల్ జెయిల్లోంచి విడిపించి వాళ్లింటికి తీసుకుపొమ్మని, సవితితల్లి తనకి ట్యూషన్ శ్రద్ధగా చెప్పకపోవడం వల్లనే ఫెయిలయ్యాననీ, ఆమెకి తనంటే కిట్టదనీ, తండ్రి కూడా ఆమె మాటే విని, తనని కోప్పడేవాడనీ రాసేవాడు."

"వాడు రాసేడని నీకెలా తెలుసు?"

"ఇదంతా నేను చేసిన ఘనకార్యమేనని దెప్పుతూ ఆ వుత్తరాలు కాపీలు నాకు పంపించేవారు."

"ఆ కుర్రాడు రాస్తే రాసేడు వాళ్లెలా నమ్మేరు? నీకెలా రాశారు?"

"దిక్కూమొక్కూ లేని సరస్వతిని పెళ్లిచేసుకోవడం వాళ్లకిష్టం లేదు. ఎంతో కొంత నిజముంటుందన్న నమ్మకం. దానికి సాయం సరస్వతి చెల్లెలు, గాయిత్రిని పోలిటెక్నిక్ ఇన్‌స్టిట్యూట్‌లో ఇంజనీరింగ్ కోర్స్‌లో చేర్పించి చదివిస్తున్నాడు ప్రసాదరావు."

"సురేష్ అక్కడ నిలకడగా వున్నాడా? పారిపోయొచ్చేసాడా?"

"ఏడాది తిరిగేటప్పటికి దార్లోపడ్డాడు. శలవుల్లో ముందు వాళ్ల తాతగారింటికెళ్లి పది రోజులుండి యిక్కడ కొచ్చేవాడు. వాళ్లు బాగా 'బ్రెయిన్ వాష్' చేసి పంపేవారేమో, వాడిక్కడ ఎన్ని ఉత్సాహకరమైన కార్యక్రమాలు, సరదాగా గడిపే వాతావరణం సృష్టించినా యాంత్రికంగా పాల్గొనేవాడు. వాడు సెవెన్త్ పాసయ్యేటప్పటికి సరస్వతికి కొడుకు పుట్టేడు; పదో క్లాస్ పాసయ్యేటప్పటికి గాయిత్రిని ఓ ఇంజనీర్‌కిచ్చి ప్రసాదరావే పెళ్లి జరిపించేడు."

"దాంతో ఇరుపక్షాల మధ్యా 'కోల్డ్‌వార్' ప్రారంభమై వుంటుంది".

"సురేష్‌కి పాతికేళ్లొచ్చేటప్పటికి బికాం పాసై ఎంబియ్యే చేసేడు. శలవులొస్తే ఎక్కువకాలం మేనమామ యింట్లోనే గడిపేవాడు. చుట్టంచూపుగా వొచ్చి తల్లితండ్రులతో గడిపేవాడు. అప్పటికి తన సవతి తమ్ముడు వివేక్ ఆరో క్లాసులో మంచిమార్కులతో

క్రమశిక్షణతో పెరుగుతూ అందరిచేత భేష్ అనిపించుకుంటే కలిగిన అసూయ, తల్లిదండ్రులు ఎంత ఆప్యాయతతో వాడికి సంతోషం, సంతృప్తి కలిగించాలని ప్రయత్నించినా వాళ్లని గౌరవించడం లేదు సరికదా వాళ్ల పట్ల నిర్లక్ష్యభావం పెంచుకున్నాడు."

"చదువు సంస్కారం అబ్బేయి. అలా ప్రవర్తించడం తప్పని, మీలాంటి వాళ్లు పిలిచి బుద్ధి చెప్పొచ్చుకదా!"

"ఆ ప్రయత్నం చాలాసార్లు చేసేను. వాళ్ల మేనమామలు నేర్పిన పాటే వాడు పాడేవాడు. 'మా అమ్మ స్థానంలో ఈ కోట్ల ఆస్తిని ఈవిడ మహారాణీలాగ అనుభవిస్తుంది. ఈవిడ చేతిలో మా నాన్న కీలుబొమ్మ. వాళ్లు దర్జాగా తగలెయ్యగా మిగిలిందాంట్లో ఆవిడ దయాధర్మంతో ఏం పడేస్తే అదే నాకు గతి. కడుపు చేత్తో పట్టుకుని ఏదైనా ఉద్యోగం చేసుకోమని ఆయన ప్రబోధ! పెట్టుబడికి డబ్బిస్తే వ్యాపారం చేసుకుంటాను అంటే, నువ్వు ముందు ఉద్యోగంలో చేరి రాణిస్తే ఆ అనుభవంతో బిజినెస్ చేద్దుగానిలే అంటూ ఆయన ప్రబోధ అంటాడు."

"రైటే కదా! ఏ అనుభవంలేందే ఏం వ్యాపారం చేస్తాడు?"

"వాడికి అనుభవం లేకపోయినా, అనుభవం వున్న వాడి మేనమామల్తో కల్సి వ్యాపారం చేస్తానంటాడు. అది ప్రసాదరావు కిష్టం లేదు. అసలు వరలక్ష్మిగారికే వాళ్ల పుట్టింటివాళ్ల జీవనసరళి మీద గౌరవంలేదు. వాళ్లంతా ఫిల్మ్ ఫైనాన్సింగ్, ఎక్స్‌పోర్ట్, ఇంపోర్ట్‌లు, షేర్లు- దానికి సాయం తాగుడు, పేకాట జల్సాలు..."

"అదన్నమాట! సురేష్ తండ్రి ఆస్తిలో భాగం కోసం దావా వెయ్యడానికి కారణం! అక్కడ నుంచి కథ ఆస్తి పంపకాలకొప్పుకుని, ఏ తండ్రీ ఆ వయస్సులో చెయ్యకూడనంత ఔదార్యంతో పిత్రార్జితం, స్వార్జితం అన్న భేదం లేకుండా ఆస్తిలో సగభాగం ప్రసాదరావుగారు సురేష్‌కి రాసిచ్చేడు. ఆ దావా తాలూకు దస్తావేజులన్నీ నా దగ్గరున్నాయి. విధం చెడ్డా ఫలం దక్కనట్టు కోట్ల ఆస్తి ఈ పదిహేనేళ్లలోనూ హారతి కర్పూరం లాగ..."

"వాడు చేసిన ఘనకార్యమల్లా రేఖ అనే ఇండస్ట్రియల్ కెమిస్ట్‌ని ప్రేమించి పెళ్లి చేసుకుని ఇద్దరు పిల్లల తండ్రయ్యేడు. మొహం చెల్లక తల్లిదండ్రుల దగ్గరికి వెళ్లడు. భార్యాబిడ్డలు వెళ్లకూడదు. వాళ్లేదైనా డబ్బుదస్కం యిస్తే, వాళ్ల మొహాన విసిరిపారేసేవాడు. ఇప్పుడు తాగుడు పేకాటకీ కూడా రేఖ సంపాదనే ఆధారం. ఇవ్వకపోతే కొట్టి లాక్కుంటాడు" అన్నాను.

"ఇలాంటివాణ్ణి రేఖ ఎలా ప్రేమించి పెళ్లి చేసుకుంది?" అడిగేడు వెంకట్రావు.

"పదేళ్లక్రితం కెమికల్ టెక్నాలజిస్ట్ భాస్కర్‌తో సురేష్‌కి స్నేహమైంది. అతనో 'స్మాల్ స్కేల్ యూనిట్' జాగ్రత్తగా నడుపుకుంటున్నాడు. ఆ కంపెనీలో రేఖ ఉద్యోగం చేస్తుంది. ఆ పరిశ్రమని అభివృద్ధి చెయ్యడానికి కావాల్సిన పాతికలక్షలు తను పెట్టుబడిగా పెడతానని అందులో భాగస్వామిగా చేరేడు. ముందు పదిలక్షలిచ్చేడు. ఫిల్మ్ డిస్ట్రిబ్యూషన్‌లో పెద్ద దెబ్బ తగిలి, రెండేళ్లయ్యేక మిగిలిన పదిహేను లక్షలకి చేతులెత్తేసేడు, అప్పు పుట్టక. ఈలోగా రేఖని పెళ్లి చేసుకున్నాడు."

" ఆ పెళ్లయినా తల్లిదండ్రుల ఆశీస్సులతో..."

"ఆ అమ్మాయి తల్లితండ్రుల కిష్టంలేదు. వీడి తల్లితండ్రులకి చెప్పలేదు. రిజిస్టర్డ్ మేరేజ్ చేసుకున్నారు. ప్రసాదరావు, సరస్వతి తెలుసుకుని డబ్బు, నగలు, బట్టలు తీసుకెడితే విసిరేసి అవమానించేడు."

"భాస్కర్ ఊరుకున్నాడా?"

"సురేష్ మూలాన్న అప్పటికే తనకి అయిదులక్షలు నష్టంవొచ్చిన లెక్కలు చూపెట్టి కంపెనీ నుంచి వెళ్లగొట్టేడు. భాస్కర్ అనుమతితో రిజైన్ చేసేసి, మర్యాదగా రేఖ మరో కంపెనీలో ఉద్యోగం చూసుకుంది."

"అసలు భాస్కర్ ముక్కూమొహం తెలియని సురేష్‌ని...."

"భాస్కర్ తండ్రి ప్రసాదరావు నెరుగును. సురేష్ సామర్థ్యాన్ని ఎరగడు. భాస్కర్ సురేష్‌ని అన్యాయం చేసేడనుకుంటాడేమోనని ఆయనెళ్లి సంగతంతా ప్రసాదరావుకి చెప్పేడు. వెంటనే ప్రసాదరావు అయిదు లక్షలకి చెక్కురాసి భాస్కర్‌కిచ్చి, ఈ విషయం రహస్యంగా వుంచమనీ, సురేష్ ఎంతటి అభిమానధనుడో వివరించి సముదాయించి పంపేడు."

"ఇలాంటివాణ్ణి ఆ రేఖ ఎలా ప్రేమించి పెళ్లి చేసుకుంది?"

"అప్పట్లో ఆస్తులమ్మి అప్పులు తీరుస్తున్నాడని తెలియదు కాని, సురేష్‌కి చదువు, పలుకుబడి, పరిచయాలు, సొంత యిల్లు, కారు – దర్జాగా వుండేవాడు. ఆ తర్వాత కూడా రెండు మూడేళ్ల క్రితం వరకూ ఏ లోటూ కనపడనివ్వలేదు. వాళ్లకి ఆరేళ్ల కొడుకు, నాలుగేళ్ల కూతురూను. ఆ తర్వాతే ఆర్థికంగా బాగా చితికిపోయి, మానసికంగా

కృంగిపోయి, తన నుంచి తాను పారిపోవడానికి తాగుడుకి బానిసయ్యేడు"- అని సురేష్ చరిత్ర వివరించేను.

★ ★ ★

సరస్వతి మరీమరీ రమ్మని పిలిచింది. వెళ్లకపోతే బాగుండదని పద్మజని తీసుకుని బయల్దేరేను. ప్రసాదరావు పోయిన పన్నెండోరోజున వైకుంఠ సమారాధన తర్వాత మళ్లీ యిదే వాళ్లింటికెళ్లడం. ఆ విషాద ఛాయల జ్ఞాపకాలు యింకా నా మనస్సుని వెంటాడుతూనే వున్నాయి. సురేష్ మూలంగా యింకా ఏమి అల్లరి, అప్రతిష్ఠపాలవుతుందోనన్న భయంతో సలహాలు, సంప్రదింపులు కోసం వెంకట్రావు నాశ్రయించింది. అతను సమర్థుడు, శ్రేయోభిలాషి. ఇంక ఆ విషయాల ప్రసక్తి సంభాషణలోకి రానివ్వకుండా, రెండు ఓదార్పు మాటలేమైనా అవసరమైతే పలికి, రెండు మెతుకులు గతికి బయట పడాలని ఆలోచిస్తూ పద్మజని కూడా హెచ్చరించేను.

ప్రసాదరావు ఇంటిని దురాన్నుంచి చూసి విస్తుపోయేను. చక్కని రూపురేఖలు సంతరించుకున్న నూతన భవనంలాగుంది. దానికి సాయం ఆ యింట్లో వాతావరణం, ఆవిడ ఆప్యాయత, ఆమె మొహంలో చిరునవ్వు చూశాక మనస్సు స్థిమితపడింది. ఈ బంగళాని సర్వాంగ సుందంగా పునరుద్ధరించడానికి మూలస్తంభాలయిన గాయిత్రి, ఆమె భర్తని కూడా భోజనానికి పిలిచింది.

డైనింగ్ హాల్లో కొసరికొసరి వొడ్డిస్తూ మాతోనే ఆమెకూడా కలిసి సరదాగా కబుర్లు చెప్పుకుంటుండగా భోంచేసేం. తర్వాత హాల్లో గోడలన్నీ మేము పరిశీలించడం సరస్వతి గమనించినట్టుంది.

"ఎక్కడా ప్రసాదరావుగారి ఫోటో పెట్టలేదేమని ఆలోచిస్తున్నారా?" అంది.

అది నిజం!

"దానికి ముహూర్తం చూసి మంచి ఫ్రేం చేయించి..." అని పద్మజ అంటుంటే..

"అలాంటి పని చెయ్యను. మా ఫోటోలు ఆల్బమ్‌లో నా వార్డ్ రోబ్‌లో భద్రంగా వున్నాయి. ఆయన జ్ఞాపకాలే నా ఊపిరి. ఆ మధురస్మృతుల పరిమళంతో నా హృదయం నిండివుంది. నేనెప్పుడూ వంటరిదాన్నికాను. ఆయన చిరంజీవిగా నాలోనే వుంటూ నన్ను నడిపిస్తూవుంటారు. ఆయన ఫోటో పెట్టి దండలేసి, అగరవత్తులు వెలిగించి పెట్టి వుంటే యీ గంటసేపూ సరదాగా గడిపేవాళ్లం కాము" అంది నవ్వుతూ.

"యు ఆర్ రైట్. అప్పుడిక్కడ సంతాప సభ వాతావరణం నెలకొనేది. నీ సంస్కారాన్ని అభినందిస్తున్నాను" అన్నాను.

★ ★ ★

వెంకట్రావు మార్నింగ్ వాక్‌కి రాలేదేమా అనుకుంటూ అతని యింటి మీదుగా తిరిగొస్తుంటే, గుమ్మంలో ప్రసాదరావు, అదే, సరస్వతి కారు కనబడింది. ఇంట్లో కెళ్లడం ఎందుకని తటపటాయిస్తుంటే, కిటికీలోంచి వెంకట్రావు చూసినట్టున్నాడు - వెంకట్రావూ, అతని భార్య, సరస్వతి వరండాలో కొచ్చి నన్ను లోపలికి రమ్మన్నారు.

"రండన్నయ్యగారూ కూర్చోండి. మంచి సమయాని కొచ్చేరు. మీ ఆశీస్సులు కూడా కావాలి" అంది సరస్వతి.

"చిత్తశుద్ధి, ఆత్మవిశ్వాసం వున్నదానివి. నీకు కావల్సింది ఆ భగవంతుడి ఆశీస్సులు" అన్నాను.

"భగవంతుడి ఆశీస్సులు నాకెప్పుడూ వున్నాయి. చిన్నతనంలో, పేదరికంలో చదువు కొనసాగదేమోనని భయపడ్డాను. ఈ సమాజం నన్నాదుకుంది. సమాజం భగవంతుని విశ్వరూపం. ఆ రూపంలో నాకు సాయం చేసేదు. పెళ్లవ్వదనుకున్నాను. వరలక్ష్మిగారు నాకు మాంగల్యభిక్ష పెట్టేరు. ప్రసాదరావుగారి దయవల్ల మా గాయిత్రికి చదువు చెప్పించి, పెళ్లి చేయగలిగేను. వివేక్‌ని కన్నాను. పెద్ద చదువు చదివించేను, పెళ్లి చేసి స్టేట్స్‌కి పంపేను. వీటి వెనుక భగవంతుడి అదృశ్య అభయ హస్తం లేదంటారా!" అంది.

"కాని భగవంతుడు అంత నిర్దయగా ప్రసాదరావుగార్నిలాగ తీసుకుపోతాడనుకోలేదు" అంది వెంకట్రావు భార్య.

"భగవంతుడెప్పుడూ దయామయుడే. కష్టం సుఖం రెండూ ఆయన ప్రసాదాలే. కష్టాలనుభవిస్తే కాని సుఖం విలువ తెలియదు. నేను ముప్ఫయ్యేళ్లు ఆనందంగా దాంపత్య జీవితాన్ననుభవించేను. ఆయన డెబ్బయి రెండేళ్లు జీవించేరు. ఆయన మరో పదేళ్లున్నా, సురేష్ గురించి దిగులుతో, శారీరకంగానూ, మానసికంగానూ అనారోగ్యంతో, అశాంతితో, జీవించవలసి వచ్చును. అందుకే ఆ మహానుభావుడు అనాయాస మరణం పొంది, ఆ కుటుంబ గౌరవం కాపాడే బాధ్యత నా కప్పగించేరు. అదే నా లక్ష్యం, నా కర్తవ్యం" అంది.

"మీ కుటుంబ గౌరవం కాపాడే బాధ్యత నీ వొకర్తిదీ కాదమ్మా, ఆ సురేష్‌లో పరివర్తన రావాలి. ముందు వాడీ కేసు నుంచి బయటపడాలి, కదా!" అన్నాను, సాధ్యాసాధ్యాలు బేరీజువేస్తూ.

"బయట పడినట్లే. భాస్కర్ ప్రాణాలతో బయట పడటమే వాడి అదృష్టం" అన్నాడు వెంకట్రావు ధీమాగా.

"భాస్కర్‌కి ప్రసాదరావు దంపతులపైన అపారమైన గౌరవం వుంది. సురేష్ భాస్కర్ల స్నేహం, సురేష్ రేఖ ఆ కంపెనీ నుంచి ఎందుకు పైదొలగవచ్చిందో, ఆ వివరాలన్నీ సరస్వతికి తెలుసు. ఆ దంపతులు చేతులు పట్టుకుని సరస్వతి ఆదరించడంతో భాస్కర్ భార్య కరిగిపోయి కేసు ఉపసంహరించుకొందుకు అంగీకరించింది. దానికి సాయం ఆ కంపెనీ అభివృద్ధి చెయ్యడానికి కావల్సిన పెట్టుబడి ఎంతయినా సరే తను పెడతాననీ, సురేష్ రేఖలకు తిరిగి తన కంపెనీలో స్థానం కల్పించమని సరస్వతి కోరింది. అందుకు భాస్కర్ అంగీకరించేడు" అన్నాడు వెంకట్రావు.

"భాస్కర్‌కి, సురేష్ భార్య రేఖకి మధ్య అక్రమ సంబంధం వుందనీ, భాస్కర్ రెండుసార్లు డబ్బు పట్టుకొచ్చి రేఖకివ్వడం స్వయంగా చూశానని సురేష్ వాంగ్మూలం..." నా సందేహం చెబుతున్నాను.

"భాస్కర్ యిచ్చింది రెండుసార్లు కాదు ఈ రెండు సంవత్సరాల్లో చాలాసార్లు. సురేష్ చూసింది రెండుసార్లే. నిజానికి ఆ డబ్బు ఎక్కణ్ణుంచి వొచ్చిందనుకున్నావు!" అని వెంకట్రావు నన్నడగడం, దానికి సమాధానమన్నట్లుగా సరస్వతి చిరునవ్వు చూసేక నా కర్థమైంది.

"ప్రసాదరావుకి తెలుసా?"

"తెలియదు. నేనిచ్చినట్లు చెప్పొద్దని, నా నగలమ్మి భాస్కర్ ద్వారా రేఖకి డబ్బు పంపించేదాన్ని" అంది సరస్వతి.

"మరి భాస్కర్ మీద అంత నీచమైన నింద..." అంటున్నాను.

"ఆస్తంతా తగలబెట్టుకొని, భార్య సంపాదన మీద బ్రతుకుతున్నాడు. ఆ దారిద్ర్యంలో, దురభిమానంతో, తాగుడు మైకంలో వొళ్లు తెలియని ఆవేశంలో కత్తితో పొడిచేడు. తను చేసిన ఘాతుకాన్ని సమర్థించుకోడానికి ఆ నింద వేసేడు" అన్నాడు వెంకట్రావు.

"ఇప్పుడైనా సురేష్ దార్లో కొస్తాడంటారా?" అన్నాను.

"నిన్న జైల్లో భాస్కర్ సురేష్‌ని కలిసి జరిగిదంతా వివరించేడు. వాడు పశ్చాత్తాపంతో కంట తడిపెట్టుకున్నాడట."

"వాడు మారితే అంతకంటే ఏం కావాలి! అటువంటి పుణ్యదంపతుల కొడుకు. వాళ్ల ఆత్మ శాంతిస్తుంది" అంది వెంకట్రావు భార్య.

"తప్పకుండా మారతాడు. వివేక్ నేను కన్నకొడుకు. వాడు సంపాదించుకుంటున్నాడు. వాడికే లోటులేదు. సురేష్ నాకు జీవితాన్ని ప్రసాదించిన కొడుకు. అజ్ఞానంతో తప్పు చేసేడు. రెండు నెలలుగా జైల్లో వున్నాడు. ఆ శిక్ష చాలు. వివేక్ అంగీకారంతోనే, మిగిలిన ఈ యావదాస్తినీ అనుభవిస్తూ, సురేష్, రేఖ, పిల్లలతో నేను వుండటానికే ఈ యిల్లంతా బాగు చేయించి సిద్ధం చేశాను" అని సరస్వతి అంటుంటే ఆమె ముఖంలో కనిపించిన శాంతి, కాంతి...

** రచన - నవంబర్, 2003*